# పంజరం - పంకజం

ఒంటెద్దుబండి సాగిపోతోంది.

శివరామయ్యగారు బండి వెనుక నడుస్తున్నారు. బండి ఊరుదాటి ఫర్లాంగు దూరం వచ్చేసింది.

వాగు సమీపించింది.

"ఇక ఉండు నాన్నా .... చాల దూరం వచ్చావు.... వెళ్ళొస్తాం" అంది పంకజం.

"వెళ్ళొస్తామామయ్యా" నారాయణరావు అన్నాడు. పొంగివస్తున్న ప్రేమకొద్దీ శివరామయ్యగారు వాగుదాటి కొంతదూరం వచ్చి

"ఉంటానమ్మా" అంటూ సహజంగా వచ్చే కన్నీటిని ఉత్తరీయంతో అద్దుకుంటూ వెనక్కి తిరిగి నడవటం మొదలెట్టారు.

గతస్మృతులు మెల్లిగా మనసులో మెదిలాయి. పంకజంకు ఐదవయేట తల్లి పోయినది మొదలు అల్లారుముద్దుగా పెంచాడు. భగవంతుని దయవల్లనే పంకజంను పెద్దదాన్నిచేసి కాస్తో....కూస్తో స్వయంగా చదువుచెప్పి ఒక ఇంటిదాన్ని చేశాడు. అల్లుడు నారాయణరావు బి. ఏ ప్యాసైనప్పటికీ ప్రైవేటు కంపెనీలో గుమాస్తాగా పనిచేస్తున్నాడు.

తన సంతోషంకొద్దీ కూతురునీ అల్లుణ్ణీ సంక్రాంతికి ఇంటికి రప్పించాడు. తన చేతనైనంతగా మర్యాదలు చేసాడు.

బాధగా ఇంటికి చేరుకున్నారు శివరామయ్యగారు.

ఎంతవాడికైనా ఈ క్షణం రాక తప్పదు. ఎప్పటికైనా ఆడపిల్లను ఒకళ్ళ చేతిలో పెట్టి సాగనంపాల్సిందే. ఆ తృప్తితోటే మిగిలిన నిస్సార జీవితాన్ని శివరామయ్యగారు గడపగల్గుతున్నారు.

మోడువారిన తన జీవితంలో పంకజం నవవసంతాన్ని చిగిర్చిందన్న సంగతి శివరామయ్య ఎన్నటికీ మరువడు.

.... .... .... ....

నారాయణరావుకు తల్లి దండ్రులు గతించినప్పటి నుంచీ పినతండ్రి శేషయ్యగారి వద్దే పెరిగి పెద్దవాడయ్యాడు. శేషయ్యగారు చిన్న లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు.

తండ్రి ఆరోగ్యస్థితి ఎలాఉందో పంకజంకు దిగులుగా ఉంది.

పొద్దునలేచింది మొదలు రాత్రి పడుకోబోయేవరకూ పంకజంకు తీరికయేఉండదు.

పొద్దున్నేలేచి మామగార్కి స్నాన సంధ్యలకు కావలసిన అవసరాలన్నిటినీ తీర్చి వంటచేసి నారాయణరావుకుపెట్టి ఆఫీసుకు పంపి తన పనులన్నీ చేసుకొని భోంచేసేసరికల్లా మధ్యాహ్నం రెండుగంటలకు తక్కువకాదు. ఒక గంట విశ్రాంతి తీసుకోకముందే మధ్యాహ్నపు పనులు కాఫీలు రాత్రి భోజనాలతో రోజంతా అయిపోతుంది. ఒక్కక్షణంకూడా తీరికలేదు పంకజానికి.

రచన:

శ్రీ డి. వి. సీతారామమూర్తి

ఏ పనిమీద ఎక్కడికి వెళ్ళినా మామగార్ని అడగందే వెళ్ళటానికి వీల్లేదు.

భర్త సంగతి వేరే చెప్పనక్కర్లేదు - నిజం చెప్పాలంటే నారాయణరావు శేషయ్య చేతిలో కీలుబొమ్మ.

అలాగే రోజులు గడుస్తున్నాయి ఒక రోజున నారాయణరావు సినిమాకు వెళ్ళాలని ప్రోగ్రాం వేసుకున్నాడు.

"ఆఫీసు నుంచి తొందరగా వస్తా - నే వచ్చేప్పటికి రెడీగా ఉండాలి. సినిమాకు వెళ్దాం"

ఆఫీసుకు పోతూ నారాయణరావు అన్నాడు, పంకజం మౌనంగా విన్నది.

సాయంత్రం ఐదయ్యే సరికల్లా పనులన్నీ ముగించుకొని ముస్తాబై నారాయణరావు కోరకు ఎదురుచూస్తూ నిలబడింది పంకజం.

ఇంతలో నారాయణరావు వచ్చాడు. కాఫీ ఫలహారములు ముగించుకొన్నాడు.

శేషయ్యగారు ఫైలుతీసికొని లోపలికి వచ్చాడు.

"పంకజం! కాసిని మంచినీళ్ళు తీసుకురా!" అన్నారు శేషయ్యగారు.

పంకజం లోపలికి వెళ్ళింది.

"ఈ బిల్సు అర్జంటుగా వెళ్ళాలి. వీటి సంగతి చూడు" అంటూ శేషయ్యగారు ఫైలును నారాయణరావుకు యిచ్చాడు.

"రేపు చూస్తాలెండి. సినిమాకు వెళ్తున్నాం" అంటూ నీళ్ళు నమిలాడు నారాయణరావు.

"సినిమా రేపుకూడా ఉంటుంది - అర్జంటు బిల్సు" అన్నారు నిష్కర్షగా.

నారాయణరావు ఫైలును తీసుకోటం తప్ప ఏమీ చేయలేక పోయాడు.

నీళ్ళగ్లాసుతో వచ్చిన పంకజం మనసు చివుక్కు మంది.

లోపలికి వెళ్ళింది. వస్తున్న కన్నీటిని కొంగుతో అద్దుకుంది.

సినిమాకు వెళ్ళాలన్నా స్వేచ్ఛలేదు. వాళ్ళు వెళ్ళమన్నపుడే వెళ్ళాలి.

"బానిస జీవితం." మనసు గాయపడ్డది.

నారాయణరావు ఫైలులో మునిగిపోయాడు. తన జీవితానికి స్వేచ్ఛలేదు.

సరస్సులో పుట్టిన పంకజం, ఏరులో కొట్టుకువచ్చి, ఊబిలో దిగపడింది.

తన జీవితమే ఒక పంజరం. పంజరంలోనే తను జీవిస్తున్నది.

అందాల రామచిలుక జీవించేది ఇనుప పంజరంలో, తాను బంగారపు పంజరంలో.

పంకజం మనసు కలవర పడ్డది.

వెక్కి వెక్కి ఏడ్చింది. ఏం ప్రయోజనం? నారాయణరావు లోపలికి వచ్చాడు.

పంకజం పడుతున్న వ్యథను అర్థం చేసికొన్నాడు.

ఏం చేయగలడు ?

పిన తండ్రిని ఎదిరించి వేరుపడగల సమర్థత నారాయణరావుకు లేదు.

అందువల్లే ఏదిచెప్పినా మౌనంగా చేసుకు పోతాడు.

అలాటి సంఘటనలే పంకజం జీవిత క్రమంలో జరుగు తుంటాయి

సరళ, పంకజం ప్రాణ స్నేహితురాలు. ఆ ఊళ్ళోనే ఉంటుంది

సరళ ఇంట్లో శుభకార్యానికి పంకజంను పిల్చింది పంకజం వెళ్ళటానికి నిశ్చయించు కొంది. నారాయణరావును అడిగింది. వెళ్ళమన్నాడు.

మామగార్ని అడిగే ఉద్దేశ్యంతో పంకజం శేషయ్య గది దగ్గరకు వచ్చింది.

"మామయ్యా !" పంకజం తలవంచుకొనే పిల్చింది.

"ఏమ్మా" శేషయ్య తలెత్తి చూసాడు.

"సరళ పేరంటానికి పిల్చింది. వెళ్ళ వస్తా మామయ్యా" పంకజం అమాయకంగా అడిగింది.

"ఇవ్వాళేనా...కుదరదే. నా స్నేహితుడు ఇంటికి వస్తున్నాడు. చాలా రోజులైంది వాణ్ణిచూసి. యివ్వాళ వస్తున్నానని టెలిగ్రాం యిచ్చాడు... చూడమ్మా ! ఇంట్లో అన్నీ ఉన్నాయిగా, అయిపోయినవి ఏమన్నా ఉంటే నారాయణరావుకు చెప్పు, తెస్తాడు. ఇదిగో డబ్బు." అంటూ పంకజంకు అందించాడు. పంకజానికి ఏ మూలో దాగియున్న ఆశ కర్పూరంలా హరించి పోయింది.

ఆశ నిరాశైంది.
తిరిగి గదిలోకి వచ్చింది.

"పంకజం ! ఏమన్నాడు ?" నారాయణరావు దగ్గరగావచ్చి ప్రశ్నించాడు.

పంకజం సంగతంతా తల వంచుకొనే ఏకరువు పెట్టింది.

నారాయణరావు బాధగా మూలిగాడు. మరొకసారి పంకజం హృదయక్షేత్రంలో గాలివాన ప్రారంభ మైంది.

నిరాశ, నిస్పృహ, ఆవరించినయి.

"ఈ పంజరంలో నుంచి బయట పడే గీతలేదేమో !" కాలి వ్రేళ్ళను గడపమీద రాస్తూ నిల్చుంది పంకజం తనపేరు సార్థక మైంది

తనచుట్టూ సాలెగూడువలె ఆవరించుకొని ఉన్నాయి పరిస్థితులు.

ఈ వ్యూహం చెదిరేరోజు రాదేమో ! ఈ జీవితం ఇలా అంతం కావాల్సిందేనేమో ! పంకజం కళ్ళు ఆర్ద్ర మైనవి.

నారాయణరావు లోపలికి వచ్చాడు.

పంకజం ఆలోచనలకు అంతరాయం కలిగింది.

హృదయంలో పెనుతుఫాను చెలరేగుతున్నప్పటికీ ముఖంమాత్రం ప్రశాంతంగా ఉండాలని పంకజం ప్రయత్నిస్తుంది.

◆ ◆ ◆

శివరామయ్యగారు పిల్లలకు పాఠం చెపుతున్నారు. అకస్మాత్తుగా వచ్చిన దగ్గుతెర మనిషిని కదిపివేసింది. సన్నగా గుండెనొప్పి ప్రారంభమైంది.

పాఠం చెప్పలేకపోయారు. యింటికి వచ్చి పడుకొన్నారు. పరిచర్యలు చేసే వాళ్ళెవరూ లేరు. స్కూలు పిల్లలే అవీ ఇవీ తెచ్చిపెట్టి సహాయపడుతున్నారు.

రోజులు గడవటం కష్టమైంది. శివరామయ్యగారికి జబ్బు రోజురోజుకీ ఎక్కువవటమేగాని తగ్గటంలేదు

ఉన్నట్టుండి ఒకరోజు గుండెనొప్పి ఎక్కువై శివరామయ్యగారికి బ్రతుకు తానన్న ఆశ అడుగంటిపోయింది.

పంకజంకు టెలిగ్రాంయిచ్చారు. రాత్రికల్లా పంకజం, నారాయణరావు వచ్చాడు.

కాళరాత్రి పూరింటిలో మినుకు మినుకుమనే దీపపుకాంతిలో పంకజంను చూసి ప్రాణం విడుద్దామని కనిపెట్టుకొనిఉన్న శివరామయ్యగారు పంకజం రాగానే "వచ్చావమ్మా ! నిన్ను చూద్దామనే ఇంతవరకు బ్రతికిఉన్నా.. ! నారాయణరావు ఏడి ?" పంకజం తలనిమురుతూ అన్నారు శివరామయ్యగారు.

"ఊరుకోనాన్నా" అంటూ పంకజం భోరున ఏడ్చింది.

నారాయణరావు గుండె తరుక్కుపోయింది. పంకజం పరిస్థితి మరీ అధ్వాన్నమైంది.

పంకజం, నారాయణరావుదగ్గరఉండగనే శివరామయ్య జీవనజ్యోతి ఆరిపోయింది.

మానసికంగా ఇల్లంతా చీకటైంది. పంకజం జీవితంకూడా అంతే.

ఇంతవరకూ తనకోరకు బాధపడే తండ్రికూడా దూరమయ్యాడు.

ఇప్పుడు పంకజం ఏకాకి, స్కూలు, పనిచెయ్యటంలేదు. శివరామయ్య ఏనాడు గతించాడో ఆనాటితోనే స్కూలు మూల పడ్డది.

ఇంటికి తిరిగి వచ్చారు, నారాయణరావు మారిపోయాడు. ఎప్పుడుచూసినా ఏదో ఆలోచనలోనే ఉంటాడు.

ఆఫీసులోగూడా మగతగా ఉంటాడట.

నారాయణరావు ఒక నిశ్చయానికి రాగలిగాడు తనభాగం తనకిమ్మని శేషయ్యగార్ని అడిగాడు.

ఇచ్చినా యివ్వకపోయినా తన రెక్కలమీద జీవిద్దామనే మనోధైర్యం కలిగింది.

కాలచక్రం గిర్రున తిరిగి ఏడాది పూర్తయింది. నారాయణరావు బి. ఇడి. ట్రైనింగు పూర్తిచేసాడు.

శివరామయ్యగారు పనిచేసిన స్కూల్లోనే మేష్టరుగా చేరాడు.

మామగారి అడుగు జాడల్లోనే కాలం గడుపు తున్నాడు.